నిధులు మంజూరైనా..!

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా ఉంది అక్కడ పరిస్థితి. ప్రజల కష్టాలు గట్టెక్కించడానికి నిధులు మంజూరు చేసినా పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా పనులు పట్టాలెక్కలేదు. కాదు కాదు కనీసం టెండర్‌కు కూడా నోచుకోలేదు. దీంతో లంకెపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద అవస్థలు తప్పడం లేదు. రెండేళ్లు కావస్తున్నా రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై లంకెలపాలెం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– అగనంపూడి



గ్రామం మీదుగా నిర్మించిన ఫ్లైఓవర్



మూసివేసిన రైల్వే క్రాసింగ్ గేటు

- నిర్మాణంలో జాప్యం
- రెండేళ్ల నుంచి టెండర్లకు నోచుకోని లంకెలపాలెం అండర్‌పాస్ వంతెన
- రూ.4.91 కోట్లు మంజూరు చేసిన రైల్వే బోర్డు
- పాలకులకు పట్టకపోవడంతో తప్పని కష్టాలు

లంకెలపాలెంలో ఫ్లైఓవర్ నిర్మించడంతో రైల్వేక్రాసింగ్ గేటు మూసివేశారు. ఈ కారణంగా గ్రామస్తుల మధ్య దూరాభారం పెరిగింది. 30 మీటర్ల దూరానికి కిలోమీటన్నర ప్రయాణం చేయాల్సి వస్తోంది. వీరి కష్టాలను చూసి రెండేళ్ల కిందట అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి ఎంపీ సత్యవతి చొరవతో ఫ్లైఓవర్ వంతెనను ఆనుకొని అండర్‌పాస్ నిర్మాణానికి రూ.4.95 కోట్లు రైల్వేబోర్డు మంజూరు చేసింది. నిధులు విడుదల చేస్తూ బోర్డు ఉత్తర్వులు ఇచ్చిన కొద్దిరోజులకే ఎన్నికల వచ్చాయి. ఇంతలో పాలకులు మారిపోవడంతో రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణం గాలిలో కలిసిపోయింది. ఫ్లైఓవర్‌ను ఆనుకొని అండర్‌పాస్ వంతె నిర్మించాలన్న దశాబ్దంన్నర కల.. కలగానే మిగిలిపోయింది.

కొత్త కష్టాలు

లంకెలపాలెంమీదుగా రైల్వే ట్రాక్ ఉండడంతో 15 ఏళ్ల కిందట రైల్వే క్రాసింగ్ వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోయేవి. దీంతో రాంకీ ఫార్మా సిటీ ఉద్యోగులు, ఫార్మా కంపెనీల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించారు. అయితే లంకెలపాలెం మీదుగా వచ్చి పోయే వాహనాల కష్టాల తీరినా గ్రామస్తులకు కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. ట్రాక్‌కు రెండు వైపులా గ్రామం విస్తరించి ఉంది. వంతెన నిర్మాణంతో క్రాసింగ్ గేట్లు ఎత్తివేయడంతో గ్రామ ప్రజలు ఒక వైపు నుంచి మరోవైపు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పనిమీద దుకాణాలకు, బస్టాప్, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా చుట్టు యాత్ర చేయాల్సి వస్తుంది. పాదచారులు మాత్రం క్రాసింగ్ గేటు కింది నుంచి నిబంధనలు అతిక్రమించి పట్టాలు దాటుతూ ప్రమాదాలకు ఎదురొడ్డి రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో స్థానికులు ఫ్లైఓవర్‌ను ఆనుకొని అండర్ పాస్ నిర్మించాలని పాలకులకు మొరపెట్టుకుంటూ వస్తున్నారు.ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎంపీ సత్యవతి రైల్వే బోర్డు దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చూస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాలకులకు పట్టదా

నిధులు మంజూరై మూడు మాసాలకే ఎన్నికలు రావడంతో టెండర్ల ప్రక్రియ వద్ద నిలిచిపోయింది. అప్పటి నుంచి పట్టించుకొనే పాలకులు కరువవ్వడంతోవంతెన కష్టాలు తీరని వ్యథగా మారాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కూటమి పాలకులు ఒత్తిడి తెచ్చి టెండర్లు పూర్తి చేసి వంతెన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



బోర్డు నిధులు విడుదల చేసిన తర్వాత నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు. టెండర్లు పిలిచి పనులు చేపట్టేలా స్థానిక ఎంపీ రైల్వే మంత్రి, బోర్డు పాలకవర్గంపై ఒత్తిడి తీసుకురావాలి.స్థానిక కూటమి నాయకులు అండర్ పాస్ వంతెన నిర్మాణ విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేయాలి. పి.హరనాథ్, అగనంపూడి

దుకాణానికి వెళ్లాలన్నా అవస్థలు



గ్రామంలో నుంచి దుకాణానికి మరే ఇతర పని మీద కూడలికి రావాలంటే వాహనాలపై వెళ్లాల్సిందే. క్రాసింగ్ గేటు ఎత్తిన తర్వాత పట్టాలు దాటుతూ వెళ్లడం రైల్వే నిబంధనల అతిక్రమణగా భావిస్తారు. పాదచారులు కూడా చుట్టుయాత్రలు చేయాల్సిందే. గ్రామానికి ఒకవైపు ఉన్నవారు మరోవైపు రావాలంటే దూరాభారం తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి అండర్‌పాస్ వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

– బి.సత్యనారాయణ, ఫార్మాసిటీ

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గాజువాక: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి గుణాత్మక విద్య అందించేందుకు సహకరించాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. నిరసన వారోత్సవాల్లో భాగంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు మాట్లాడుతూ పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలని, బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, తక్షణమే మెమో 57 అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితి రూ.25లక్షలకు పెంచాలని కోరారు. మదింపు కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ మండల కమిటీల ప్రతినిధులు విజయశ్రీ, బి.దివాకర్, సన్యాసినాయుడు, డి.శ్రీనివాసరావు, జి.నాగభూషణ రావు, పల్లా అప్పారావు, రామ్మోహన్, రమేష్, సతీష్, త్రిలోక్, శంకర్, సునీల్ పాల్గొన్నారు.

అప్పన్నకాలనీలో మంచినీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న గుడివాడ లతీష్

గాజువాక: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ఆదివారం ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలి



శిష్టు ఖగేశ్వరరావు

అగనంపూడి: ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల స్థాయిలో ఈ నెల 16న ఓజోన్ పొర వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు చెప్పారు. అగనంపూడిలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదేశాలు, ఏపీ ఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డైరెక్టర్ సూచనల మేరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఓజోన్‌దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అంబరిల్లా ర్యాలీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు.

జీతాల కోసం నిరసనలు నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్టీల్ సీఐటీ యూ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద 8 నుంచి 9 గంటల వరకు కంచాలతో నిరసన , అదే విధంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద 8 నుంచి 9 వరకు ధర్నా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గోవాలని ఆయా సంఘాల నాయకులు కోరారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి రమణ

పెదగంట్యాడ: విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు ప్రతి ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అందులో నీతిని వివరించారు.

సూదికొండపై అక్రమ కట్టడాలు

- దందాలకు పాల్పడుతున్న చోటా నాయకులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు





సూదికొండపై తవ్వకాలు చేపట్టి నిర్మాణాలు సాగిస్తున్న ఆక్రమణదారులు

అగనంపూడి: అగనంపూడిలో టీడీపీ చోటా నాయకులు అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. ప్రభుత్వ భూమి ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అగనంపూడి సెక్టార్–1లో చోటా నాయకుడు సర్వేనంబర్ 141లో దుర్గాదేవి ఆలయానికి సమీపంలో కొండ ను పిండిచేసి స్థలాలు చదునుచేసి అమ్మేస్తున్నారని కొంత మంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక్కో వ్యక్తి నుంచి రెండు నుంచి మూడు లక్షల వరకు డబ్బులు వసూలు చేసి స్థలాలు అమ్మేస్తు న్నా, రెవెన్యూ అధికారులు కళ్లప్పగించి చూస్తున్నా రు తప్పా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించినా మళ్లీ అదే ప్రదేశంలో కట్టడాలు నిరాటంకంగా సాగుతున్నా యని కొంతమంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సెక్టార్2లో... : అలాగే సెక్టార్–2కి చెందిన మరో చోటా నాయకుడు జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు, మంచినీటి కుళాయిలు ఇప్పిస్తామని నమ్మబలికించి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసిన వైనంపై ఎమ్మెల్యేను బాధితులు నేరుగా కలిసి ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే సెక్టార్–3కి చెందిన మరో నాయకుడు మహిళలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని, దీని వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తుందని ఆ పార్టీలో కొంతమంది నాయకులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మరో నాయకుడు కూడా పార్క్ స్థలాలను అప్పనంగా అమ్మేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



రాట వేస్తున్న నాగిశెట్టి శ్రీను తదితరులు



నడుపూరులో పందిరి రాట వేస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని పెట్రోల్ ఎదురుగా వైఎస్సార్ సీపీ నాయకుడు నాగిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రాట వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 65వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, నాయకులు కృష్ణకుమార్, ప్రసాద్, వరహాలు, సతీష్, పోతిన శ్రీనివాసరావు, చిన్న, దేవి, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో నూకాంబిక ఆలయ ఆవరణలో అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2 వరకూ నిర్వహించనున్న శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం పందిరి రాట వేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతులకు ఐకాన్ అవార్డులు



పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు మూర్తి, సునీత దంపతులు

అగనంపూడి: గాజువాక ప్రాంతానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు డీఎస్ మూర్తి, ఆయన సతీమణి, ఉపాధ్యాయురాలు సునీతకు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, కెన్నడీ ఇంటర్నేషనల్ విద్యా సంస్థలు సంయుక్తంగా పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డులు ప్రదానం చేశాయి. గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను మూర్తి, సునీత దంపతులు స్వీకరించారు.వినూత్న బోధన పద్ధతులు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించే ఉపాధ్యాయులకు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ అవార్డులను ప్రదానం చేస్తుంది. వీరివురూ వ్యక్తిత్వ వికాసం, సమయ పాలన, విద్యా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం వంటి అంశాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపుతున్నారు. వీరి శ్రమను గుర్తించిన జీజీయూ ఈ అవార్డులకు ఎంపిక చేసినట్టు మూర్తి తెలిపారు.

ముస్లిం విద్యార్థులకు సూక్తుల పోటీలు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

గాజువాక: మహ్మద్ ప్రవక్త జయంతి కార్యక్రమాల్లో భాగంగా అంజుమన్ సిరతున్ నబీ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం విద్యార్థులకు ఆదివారం మత సూక్తుల (నాతే కలాం) పోటీలు నిర్వహించారు. అజీమాబాద్ సున్నీ జామా మసీద్ ఇమామ్ మహ్మద్ షాకీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 400 మంది చిన్నారులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలతో పాటు మదర్సాలో ఖురాన్ పఠనాన్ని పూర్తి చేసిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సున్నీ జామా మసీదు ముత్వల్లి మదీనావలి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, అంజుమన్ సిరాతున్ నబీ కమిటీ సభ్యులు అన్వర్, మున్వర్, బుజ్జి, ఖాదర్‌వలీ, ఇమామ్, షబ్బీర్, జమీర్, అన్సర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రయాహినిక దీక్షతో ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఈకే చారి దంపతులు తెలిపారు. సోమవారం శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉట్ల సంబరాలు ఉంటాయని చెప్పారు. అలాగే 16న లక్ష కుంకుమపూజ, 17న లక్ష తులసీ పూజ, పూర్ణాహుతి జరిపించనున్నామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేంకటేశ్వరస్వామి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

దుర్గాదేవి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త పైడిరాజు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సూదికొండపై వెలిసిన మాతా దుర్గా భవానీ అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బళ్ల పైడిరాజు, కమిటీ గౌరవాధ్యక్షులు కరణం లక్ష్మి అప్పారావు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. 22న పెదమడకలోని పైడిమాంబ అమ్మవారి ఆలయం నుంచి భారీ ఊరేగింపు, 26న సామూహిక కుంకుమపూజలు, 29న సరస్వతీదేవి పూజ, వచ్చే నెల 1న విశేష అన్న సమారాధన, 2న విజయదశమి పూజలు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, గంతకోరు అప్పారావు, తాతకొండ వెంకటరావు, పతివాడ ప్రసాద్ చందు పాల్గొన్నారు.